## క్లుప్తంగా...

### సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం

మన్సూరాబాద్‌: సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరమని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్టీసీ సూపర్‌వైజర్స్‌కాలనీకి చెందిన రవికిరణ్‌కు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ నుంచి మంజూరైన రూ.1.75 లక్షల ఎల్‌ఓసీని సోమవారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమల పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తోటమహేష్‌యాదవ్‌, మధుసాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

### రహదారులను ఆధునీకరించాలి

సైదాబాద్‌: కాలనీల్లోని అంతర్గత రహదారుల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌ కోరారు. యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్‌ హుస్సేన్‌ ఇటీవల ఐఎస్‌సదన్‌ డివిజన్‌ పరిధిలోని సుబ్రహ్మణ్యనగర్‌ కాలనీలో పర్యటించగా కాలనీలోని రెండు ప్రధాన రహదారులు, పార్కు వద్ద ఉన్న ఓపెన్‌ నాలాల గురించి కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం జీహెచ్‌ఎంసీ సంతోష్‌నగర్‌ సర్కిల్‌ అధికారులు కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యనగర్‌ కాలనీలోని రెండు ప్రధాన రహదారులు ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమయ్యాయని దశాబ్దాల క్రితం నిర్మించిన వాటిని వెంటనే ఆధునీకరించాలని అధికారులను కోరారు. అదే విధంగా కాలనీలోని నాలాకు పైకప్పు, రిటర్నింగ్‌ వాల్‌ నిర్మించాలని కోరారు.

### భార్య గొంతు కోసిన భర్త రిమాండ్‌

నాగోలు: అదనపు కట్నం కోసంభార్య గొంతు కోసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించిన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు లక్ష్మినర్సింహ స్వామి కాలనీలో అద్దె ఇంట్లో ఉండే ఉప్పుతల్లి వేణుగోపాల్‌, మహాలక్ష్మి భార్యాభర్తలు. పెళ్లి సమయంలో ఇచ్చిన వరకట్నం సరిపోలేదని అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆదివారం బంధువుల ఇంట్లో గృహప్రవేశం వేడుకకు రావాలని మహాలక్ష్మి వేణుగోపాల్‌ని కోరగా కోపోద్రిక్తుడై పేపర్‌ కట్టర్‌ బ్లేడు తీసి ఆమె గొంతు కోశాడు. ప్రతిఘటించిన సమయంలో మహాలక్ష్మి కుడి చేతి చిటికెన వేలు తెగిపోయింది. రక్తపు మడుగులో బయటకు పరుగెత్తుకొచ్చింది. గాయపడిన మహిళను స్థానికులు వైద్యం కోసం హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం వేణుగోపాల్‌ను రిమాండ్‌కు తరలించారు.

# బీసీ భావజాల ఉద్యమాన్ని పల్లెలకు విస్తరించాలి

నాగోలు: పాటనే ఆయుధంగా చేసుకుని తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపి, తెలంగాణ రాష్ట్రం సాధించినట్లుగానే బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చి బీసీల రాజకీయ అధికారం సాధించడానికి ఇప్పుడు కూడా పాటనే ఆయుధంగా చేసుకుని బీసీ కవులు, రచయితలు, కళాకారులు బీసీ భావజాల ఉద్యమాన్ని పల్లెలకు విస్తరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌ గౌడ్‌ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి నాగోలు సుప్రజా హాస్పిటల్‌లో బీసీ కల్చరల్‌ ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు వరంగల్‌ శ్రీనివాస్‌ అధ్యక్షత వహించగా దరువు అంజన్న, కోదారి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొని మట్లాడారు. బీసీలకు వారసత్వంగా గొప్ప చరిత్ర ఉందని, బీసీ కులాలలో రాజులు, చక్రవర్తులు, మహనీయులు జన్మించారని, బీసీ కులాలలో తరతరాలుగా ఎంతో ప్రతిభ, పటావాలు కలిగిన చరిత్ర ఉందన్నారు. ఇలాంటి ఘనమైన చరిత్ర కలిగిన బీసీలు నేడు బలహీనంగా అర శాతం, ఐదు శాతం లేని వాళ్ల దగ్గర సాగిల పడి అడుక్కోవడంలో అర్థం లేదన్నారు. బీసీ సంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి దసరా తర్వాత 33 జిల్లాలో సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌, వెంకన్న, రామలింగం, విజయ్‌కుమార్‌, ప్రసాద్‌, సందీప్‌, సంతోష్‌, రమేష్‌, సంధ్య పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జాజుల శ్రీనివాస్‌ గౌడ్‌

# కాంగ్రెస్‌ హామీలను అమలు చేయాలి

నాగోలు: కాంగ్రెస్‌ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్‌ ఎల్‌బీనగర్‌ ఇన్‌చార్జి, వీహెచ్‌పీఎస్‌ రాష్ట్ర మహిళా నాయకురాలు విద్యావతి డిమాండ్‌ చేశారు. సోమవారం సరూర్‌నగర్‌ తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్‌, వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్‌) ఆధ్వర్యంలో తహసీల్దార్‌ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వికలాంగుల పెన్షన్‌ రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, నేత, గీత, బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్‌ దారులకు రూ. 4 వేలు పెంచాలన్నారు. పూర్తి కండాల క్షీణత కలిగిన వారికి రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్‌, రాజు, శేఖర్‌, రవి, సురేష్‌, చంటి, అశోక్‌, మాలాలి శివ, రంగన్న ఏలియ, రామన్న గణేష్‌ పాల్గొన్నారు,


తహసీల్దార్‌ కార్యాలయం ముట్టడిలో ఎమ్మార్పీఎస్‌, వీహెచ్‌పీఎస్‌ నాయకులు

# కాలనీ అభివృద్ధికి చర్యలు


శంకుస్థాపనలో కార్పొరేటర్‌ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: డివిజన్‌ పరిధి క్రాంతిహిల్స్‌ కాలనీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం కార్పొరేటర్‌ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం క్రాంతిహిల్స్‌ కాలనీకి సంబంధించి నూతనంగా నిర్మించనున్న ముఖ ద్వారానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బద్దం రాంరెడ్డి, సత్తిరెడ్డి, వి.మనోహర్‌, శ్రీనివాస్‌, నారాయణ, రామాంజనేయరెడ్డి, మల్లేశం, భిక్షపతి పాల్గొన్నారు.

- వనస్థలిపురం డివిజన్‌ పరిధిలోని నాగార్జున కాలనీలో సోమవారం కార్పొరేటర్‌ వెంకటేశ్వర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్‌ నెంబర్‌ 1, 2 లలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగునీరు పొంగిపొర్లుతూ రోడ్లపై పారుతుండడంతో మురుగు, వరదనీరు రోడ్లపై నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### స్కాలర్‌షిప్స్‌ విడుదల చేయాలి

మలక్‌పేట: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయిబర్స్‌మెంట్‌, స్కాలర్‌షిప్స్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి.మహేష్‌, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్‌, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. చర్చల పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తుందే తప్ప విద్యార్థుల భవిష్యత్‌ను పట్టించుకోవడం లేదన్నారు. నవీన్‌, శ్రీనివాస్‌, ఆసీఫ్‌, రహీం, శ్రీజ, రవళి, అనూష్‌ పాల్గొన్నారు.

### సైదాబాద్‌లో వృద్ధుడి హత్య

సైదాబాద్‌: నూతనంగా నిర్మిస్తున్న ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధుడు హత్యకు గురైన ఘటన సైదాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. విష్ణునగర్‌లో నివసించే సేవ్యానాయక్‌ (70) కొత్త ఇంటిని నిర్మిస్తూ దగ్గరలోనే వేరే ఇంటిలో తాత్కాలికంగా కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. రోజూ అతను అక్కడే నిద్రిస్తున్నాడు. ఆదివారం రాత్రి అక్కడే నిద్రించాడు. ఉదయం వచ్చిన కుటుంబ సభ్యులు అతడిని లేపేందుకు యత్నించగా మృతి చెంది ఉన్నాడు. చేతులు, కాళ్లకు ఉండాల్సిన వెండి కడియాలు, వెండి మొలతాడు కనిపించలేదు. మృతదేహంపై పలుచోట్ల రక్తపు మరకలు ఉండటంతో వెండి ఆభరణాల కోసం ఎవరో హత్య చేసారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్తున్నారు. సమాచారం అందుకున్న సైదాబాద్‌ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని హతుడు సేవ్యానాయక్‌ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### వెట్టిచాకిరీకి విముక్తి కల్పించిన పార్టీ సీపీఐ

హయత్‌నగర్‌: నిజాం రజాకార్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసి ప్రజలను వెట్టి చాకిరి నుంచి విముక్తి కలిగించింది సీపీఐ పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా సోమవారం హయత్‌నగర్‌ ఆర్టీసీ డిపో ఆవరణలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణ ప్రజలు నిజాం నిరంకుశ పాలనలో బానిసలుగా బతికారని, భూస్వాములు, జాగీర్దారులు ప్రజలను పీడిస్తుండడంతో కమ్యునిస్టులు ప్రజల తరపున తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మక్దూం మోయినుద్దీన్‌ వంటి అనేక మంది నాయకులు దున్నే వాడిదే భూమి అనే నినాదంతో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ప్రజలను సమాయాత్తం చేశారని, సుమారు 3 వేల గ్రామాలను వెట్టి చాకిరి నుంచి విముక్తి చేశారని తెలిపారు. వారి పోరాటాన్ని స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారి త్యాగ ఫలితంగానే తెలంగాణ విముక్తి పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో సామిడి శేఖర్‌రెడ్డి, సరిత, శ్రీదేవి, వెంకన్న, అరుణ్‌కుమార్‌గౌడ్‌, నాగరాజు, సౌజన్య పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త వేస్తే కేసులు నమోదు చేస్తాం

నాగోలు: రోడ్లను చెత్త వేస్తే కేసులు నమోదు చేస్తామని హయత్‌నగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ వంశీకృష్ణ, నాగోలు కార్పొరేటర్‌ అరుణ సురేందర్‌ యాదవ్‌ అన్నారు. సోమవారం నాగోలు డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చెత్త రిక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. నాగోలు డివిజన్‌ శుభ్రంగా, పర్యావరణ హితంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీ చేపడుతున్న శుభ్ర హైదరాబాద్‌ కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం ముఖ్యమన్నారు. అందరూ పరిసరాల పరిశుభ్ర పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీలిమా, జవాన్‌ దర్శన్‌, సంజీవరెడ్డి, మునిందర్‌, శేఖర్‌ పాల్గొన్నారు.


రిక్షాలు అందజేస్తున్న కార్పొరేటర్‌ అరుణ, డీసీ వంశీకృష్ణ

### 22 నుంచి దసరా మహోత్సవం

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ వాసవి కాలనీలో అష్టలక్ష్మి దేవాలయంలో ఈ నెల 22 నుంచి శరన్నవరాత్ర (దసరా) మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 22న అమ్మవారి సన్నిధిలో కలశస్థాపన ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవాలయంలో ప్రతిరోజు అమ్మవారికి అలంకరణ, అర్చనలు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

### హైడ్రా సిబ్బంది అందుబాటులో ఉండాలి


హైడ్రా సిబ్బందితో మాట్లాడుతున్న పవన్‌కుమార్‌

నాగోలు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో హైడ్రా సిబ్బంది ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ సూచించారు. సోమవారం ఆయన హైడ్రా సిబ్బంది అత్యవసర సమావేశం నిర్వహించి అత్యవసర పరిస్థితులు, కాలువల ఉప్పొంగడం, విద్యుత్‌ సంబంధిత సమస్యలు, రహదారుల ధ్వంసంపై చర్చించారు. అన్ని విభాగాల సిబ్బందితో కలిసి పనిచేయాలని, అత్యవసర పరిస్థితులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్‌ ఆదేశించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో గుర్తించిన 6 అత్యవసర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ ప్రాంతాల్లో తక్షణమే బృందాలు విధుల్లోకి దిగాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరూ నిర్లక్ష్యం చూపకూడదని, విధులు విస్మరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హైడ్రా ఎస్‌ఎఫ్‌ఓ శ్రీనివాస్‌, మార్షల్‌ వీరయ్య, పవన్‌, హనుమ, హర్ష పాల్గొన్నారు.

### ఈఓ లావణ్యకు అవార్డు

చంపాపేట: చంపాపేట డివిజన్‌ కర్మన్‌ఘాట్‌ ధ్యానాంజనేయ ఆలయ ఈఓ లావణ్యకు డా. ఏపీజే అబ్దుల్‌ కలామ్‌ ఎక్సలెన్స్‌ అవార్డు దక్కింది. సోమవారం మాదాపూర్‌ హైటెక్‌ ఎగ్జిబిషన్‌ హాల్లో జరిగిన కార్యక్రమంలో లావణ్యకు అవార్డును అందజేసి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఆలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దటంతో పాటు ఆలయంలో భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన, నిబద్ధతతో చేసే సేవలను గుర్తించి అవార్డును అందజేశారన్నారు.


అవార్డు అందుకుంటున్న లావణ్య